క్లుప్తంగా

మంత్రి దయాకర్‌రావును కలిసిన సర్పంచ్ శివకుమార్



రఘునాథపల్లి: జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్ మంగళవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారని శివకుమార్ తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య ఉన్నారు.

డీసీపీని కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



చిల్పూరు: మల్కాపూర్‌కు చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో డీసీపీ సీతారాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పుస్తకాన్ని అందించారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు

రఘునాథపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎంపీటీసీ రచ్చ సోమనాథ్, మేకల నరేందర్ తదితరులు హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ బలోపేతానికి అనుసరిస్తున్న విధానాలను వివరించారు. అలాగే మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



జనగామ రూరల్: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కోశాధికారిగా ఎండి అఫీజ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్, కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అఫీజకు జిల్లా కలెక్టర్ శివలింగయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం



కొడకండ్ల: మండలకేంద్రంలో మోడల్‌స్కూల్ నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 50 ఫీట్ల వెడల్పుతో బీటీ రోడ్డు డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులను చేపడుతున్నారు. పనులను సర్పంచ్ పసునూరి మధుసూదన్ పరిశీలించారు.

పుస్తకాల అందజేత

జనగామ రూరల్: స్థానిక ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి కళాశాలకు పోటీ పరీక్షలకు సంబంధించిన రూ.20 వేల విలువైన పుస్తకాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహ్మద్ అఫ్జల్, అధ్యాపకులు వస్కూల శ్రీనివాస్, రవిప్రసాద్, సవ్వాసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న అనిల్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని అమీర్‌పేట అస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హార్ట్ సర్జరీ పేషెంట్‌కు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా వాలంటరీ బ్లడ్ వాట్సాప్ గ్రూప్ ద్వారా స్పందించిన రక్తదాతలు సకాలంలో రక్తదానం చేయగా నిండుప్రాణం నిలిచింది. సాంబయ్యకు రక్తం అవసరం ఉండగా వాలంటరీ వాట్సాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడైన ఘన్‌పూర్‌కు చెందిన పొన్న శ్రీనివాస్‌ను బాధితులు సంప్రదించారు. దాంతో శ్రీనివాస్ సమాచారాన్ని వాట్సాప్, ట్విట్టర్‌లో పెట్టిన పోస్టులకు స్పందించిన ఘన్‌పూర్‌కు చెందిన పొన్న సాయి, నాంపల్లి అనీల్‌కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రాముగౌడ్, రణధీర్‌రెడ్డి, సీహెచ్.వెంకటేష్ తదితరులు హైదరాబాద్‌కు చేరుకుని రక్తదానం చేశారు. దాంతో పేషెంట్ సర్జరీ సక్సెస్ కావడంతో అందరూ సంతోషించారు. కాగా, ఎవరికైనా రక్తం అవసరం ఉంటే తమను 9985363808 నంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాస్ తెలిపారు.

సావిత్రిబాయి పూలే జీవితం చిరస్మరణీయం



జనగామ: సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు



జనగామ రూరల్: బీఆర్‌ఎస్ మహిళా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో..



దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ సావిత్రి



జనగామ రూరల్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..

సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా విద్యాలయాల్లో, వివిధ సంఘాల, టీపీటీఎఫ్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవువురు మాట్లాడుతూ మహిళల సమస్యకు ఓ పరిష్కార మార్గం చూపిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే జీవితం చిరస్మరణీయమని అన్నారు. మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించిన దూరదృష్టి కలిగిన మహిళా సామాజిక వేత్త సావిత్రిబాయి సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



బచ్చన్నపేట: సన్మానం పొందిన టీచర్లతో సర్పంచ్ భవాని



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న సర్పంచ్ మల్లేష్ తదితరులు



జనగామ రూరల్: ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో..



జనగామ రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: చిన్నారిచే అక్షరాభ్యాసం చేయిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మొక్కలను సంరక్షించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను వంద శాతం బతికించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పల్లెప్రగతి పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పాలకుర్తి: ఈరవెన్ను గ్రామానికి చెందిన గీత కార్మికుడు పులి నర్సయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. కాగా, టాడీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.15వేల చెక్కును మంగళవారం బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్ తదితరులు నర్సయ్యకు అందజేశారు. గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఉప్పలయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమనారాయణ, ప్రభాకర్, మండల అధ్యక్షుడు వెంకన్న, సర్పంచ్ నిర్మాల చంద్రబాబు, యాదగిరి ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ మల్లవరం దివ్య అన్నారు. మంగళవారం గ్రామంలోని శ్మశాన వాటికలో చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలో మరిన్ని మెరుగైన వసతులను కల్పిస్తానని, గ్రామంలోని పల్లెప్రగతి పనులను వంద శాతం పూర్తి చేశామన్నారు. ఉప సర్పంచ్ మధు, జనగామ కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఓటరు జాబితా పరిశీలన

లింగాలఘణపురం: మండలంలో విడుదలైన కొత్త ఓటరు జాబితాను మంగళవారం తహసీల్దార్ అంజయ్యతో పాటు సిబ్బంది పరిశీలించారు. ఇప్పటి వరకు ఫాం–6, ఫాం–7పై వచ్చిన దరఖాస్తులు, నమోదు చేసిన ప్రకారం ఓటరు జాబితా వచ్చిందా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన కొత్త ఓటరు నమోదు ప్రక్రియను ఈ నెల 4న జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతుందని, అందుకు సంబంధించిన జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

జఫర్‌గఢ్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ అన్నారు. మండలంలో తిమ్మంపేటలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక విషయంలో గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ మంద మల్లేశం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సుదర్శన్, బేబి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లు కేటాయించడం జరుగుతుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. గ్రామసభ ద్వారా లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించినట్లు వారు తెలిపారు. తహసీల్దార్ స్వప్నతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతోనే నాయకత్వ లక్షణాలు



క్రీడాపోటీలను తిలకిస్తున్న అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, తమ్మడపల్లి, ఏబీ తండా, టీబీ తండా సర్పంచ్‌లు గాదె పాక అనిత, బానోత్ తులసి, భూక్య పార్వతి అన్నారు. మండలంలోని నమిలిగొండ గ్రామంలో కడియం ఫౌండేషన్ సహకారంతో కడియం యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్స్‌ను 20వ రోజైన మంగళవారం వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మంగళవారం క్వార్టర్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు బూర్ల శంకర్‌ముదిరాజ్, రాజేష్‌నాయక్, కోతి రాములు, సుధాకర్‌బాబు, ఎల్మకంటి నాగరాజు, సీరటి ప్రభాకర్, రవినాయక్, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

తరిగొప్పుల: ముదిరాజ్ కులస్తులు ఏకతాటిపై ఉండి భవిష్యత్‌లో రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి అన్నారు. ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సుంకరి నర్సింహులు ఆధ్యక్షతన మంగళవారం మండలకేంద్రంలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముదిరాజులు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, నియోజకవర్గ ఇంచార్జ్ చిలువేరు లింగం, సర్పంచ్ దామెర ప్రభుదాస్, పరమేశ్వర్, సంపత్, సత్తయ్య, కనుకయ్య, రాజు, వెంకటయ్య, రాములుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థల పరిశీలన



చిల్పూరు: మల్కాపూర్‌లోని మీసుగు రాజభూపతి వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈవిషయంపై చిల్పూరు ట్రాన్స్‌కో ఏఈ రమేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం జనగామ రూరల్ సీఐ సంతోష్, స్థానిక ఎస్సై వినయ్‌కుమార్ రైతు నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. దూరంగా ఉన్న వ్యవసాయ బావులకు చెందిన రైతులు ఈ విషయంలో కొంత జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

'జీపీ నిధులు దోచుకోవడం దారుణం'



మాట్లాడుతున్న వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేస్తుండగా గ్రామ పంచాయతీ నిధులను కేసీఆర్ దోచుకోవడం దారుణమని టీపీసీసీ మాజీ కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో, ఎన్నికల ముందు తెలంగాణకు కాపలాకుక్కలా ఉంటానన్న సీఎం కేసీఆర్ ప్రస్తుతం గ్రామ పంచాయతీల ఖజానాను దోచుకుంటున్నాడన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని ఉచిత హామీలు ఇచ్చిన సీఎం కేసీఆర్ రూ.35వేల కోట్లు దోచుకున్నాడన్నారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను సీఎం కేసీఆర్ అక్రమంగా దోచుకున్నారని అన్నారు. చేసిన అప్పులు తీర్చలేక సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రానున్న రోజుల్లో ప్రజల చేతిలో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జీడి రాంచందర్, చేపూరి ప్రభాకర్, మారపాక బాబు, జీడి స్వామి, సుదర్శన్, ఏలియా, సుదర్శన్, సన్నీ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

లింగాలఘణపురం: మండలంలోని క్లాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 587 నుండి 591 వరకు గల 10.24 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యపై మంగళవారం మండలంలోని క్లాంకు చెందిన దళితులు మబ్బు రాములు, శంబయ్య, మబ్బు నర్సయ్య, తిప్పారపు మల్లయ్య, మబ్బు కొండయ్యలు ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

గత 40 ఏళ్లకు పైగా తాము సాగు చేసుకుంటున్నామని, గతంలో నక్సల్స్ జెండాలు కూడా పాతారని, నేడు మాణిక్యాపురం సర్పంచ్ తమకు భూమి దక్కకుండా బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా సదరు భూమిపై ఎండోమెంట్, జాయింట్ కలెక్టర్ జిల్లా కోర్టులో కేసు కూడా నడుస్తుందని, 2010లో జనగామ ఆర్డీఓ భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకు రావాలని నోటీసులు కూడా జారీ చేశారని, తమ తల్లిదండ్రులు చదువుకోకపోవడంతో తెలియక ఎలాంటి ఆధారాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కల్లుగీత కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న గౌడ సంఘం కులస్తులు

తరిగొప్పుల: జీఓ 560 ప్రకారం మండలకేంద్రంలోని సర్వేనంబర్ 844లో గౌడ సంఘానికి కేటాయించిన 4 ఎకరాల భూమిని గౌడ సంఘం పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కల్లుగీత కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంఘానికి ప్రభుత్వం కేటాయించిన 4 ఎకరాల భూమిలో అన్యాక్రాంతంగా కొందరు వ్యక్తులు కబ్జా చేసి సేద్యం చేస్తున్నారని, అట్టి భూమిని గౌడ సంఘం పేరిట కేటాయించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని వాపోయారు. తాళ్లపల్లి రాజు, జాగీరు మల్లయ్య, జాగీరు రాజు, కొయ్యడ శంకరయ్య, పరుశరాములు, తాళ్లపల్లి శ్రీను, రాజ కొంరయ్య పాల్గొన్నారు.

మర్రిచెట్లను కాపాడాలని పాదయాత్ర



ఘన్‌పూర్‌కు చేరిన మేధిని సాంఘిక సేవా సంస్థ పాదయాత్ర

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ వ్యవస్థలో అతి ముఖ్యమైన వృక్షజాతి అయిన మర్రిచెట్లను కాపాడుకుందాం అనే నినాదంతో హనుమకొండ విష్ణుపురికి చెందిన వరంగల్ మేధిని సాంఘిక సేవాసంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఘన్‌పూర్‌కు చేరింది. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు నర్సింహారెడ్డి, వేణు మాట్లాడుతూ చేవెళ్ల మర్రి చెట్లను కాపాడుకుందాం అనే నినాదంతో హనుమకొండ నుంచి సంస్థ ఆధ్వర్యంలో చేవెళ్ల వరకు పాదయాత్ర చేస్తున్నామన్నారు. మర్రిచెట్లు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు శ్రీను, యాదగిరి, ఎల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి



కరపత్రాల ద్వారా ప్రగతిని వివరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తాటికొండ వెంకటేష్‌యాదవ్, ముక్క పర్శరాములు, మూడ్ ధర్మా అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మేకలగట్టు, గిద్దబండతండాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జరిగిన ప్రగతిని కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. సర్పంచ్ గడ్డమీది సంధ్యారాణికిరణ్, బానోత్ వెంకట్‌నాయక్, ఎంపీటీసీ బానోత్ భిక్షపతినాయక్, ముక్క పర్శరాములు, కొలిపాక సుదాకర్, సమ్మయ్య, సురేష్, సంపత్, వీరన్న, సురేష్, విమల, లక్ష్మి పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కృష్ణమోహన్ రెడ్డి

చిల్పూరు: మండలంలోని రాజవరంలో మనఊరు–మనబడిలో భాగంగా చేపట్టిన పాఠశాల భవన నిర్మాణ పనులను ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలతో కలిసి గ్రామ సర్పంచ్ తిరుమల భర్త, కాంట్రాక్టర్ మారేపల్లి కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ పని చేపట్టినా లాభాపేక్ష కోసం కాకుండా ఇతరుల నుంచి ఆరోపణలు రాకుండా పూర్తి చేస్తానని అన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు చెల్లించాలి



జఫర్‌గఢ్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు సంబంధించిన మూడు డీఏలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు కలిసి నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన మూడు డీఏలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాశ్, జిల్లా కోశాధికారి సుధాకర్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భానుప్రకాశ్, కృష్ణమోహన్, మహేందర్, దస్తగిరి, బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం అవిష్కరించారు. నోడల్ ఆఫీసర్ ఎండి పర్వేజ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు సిహెచ్ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, సదానందం, తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి, లిల్లిమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కొడకండ్ల: పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ కోల చంద్రమోహన్ ఆవిష్కరించారు. అనంతర పాఠశాలలకు మండల శాఖ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కిష్టయ్య, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అనీల్, గడ్డం చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మండల నోడల్ అధికారి డీవీఎల్‌ఎన్ మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో పీటీఆర్‌టీయూ టీఎస్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్‌పి భగత్, హెచ్‌ఎంలు ముత్తయ్య, వేణు, ఎల్లారెడ్డి, సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

చిల్పూరు: హైదరాబాద్‌లో మంగళవారం మంత్రి దయాకర్‌రావును స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మిశెట్టి బాలరాజులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చిల్పూరు మండలంతో పాటు తెలంగాణలో రెండో తిరుపతిగా పేరుగాంచిన చిల్పూరుగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. కాగా, మంత్రి దయాకర్‌రావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.